క్లుప్తంగా

కాణిపాకంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కాణిపాకం(చిత్తూరు రూరల్): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆస్థాన మండపంలో శనివారం ఆస్టర్ నారాయణాద్రి, వాసన్ ఐకేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆలయంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది, గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల బారినుంచి రక్షించండి

చిత్తూరు రూరల్: తమ కుటుంబంపై ఆకతాయిలు దాడి చేశారని, వాళ్ల నుంచి రక్షణ కల్పించాలని యాదమరి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బుజ్జి కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ పిల్లలు చదువు, పనులు ముగించుకుని ఇంటింటికీ తిరిగొచ్చే సమయంలో ఆకతాయిలు వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఎందుకు వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు తమ కుటుంబంపై ఆకతాయిలు దాడి చేశారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై స్టేషన్‌కు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, బాధితులు వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని యాదమరి ఎస్‌ఐ రామాంజనేయులు వివరణ ఇచ్చారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పుత్తూరులోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన దాతలు ఎం.రామ్మూర్తి కుటుంబ సభ్యులు శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ దాతలు ప్రతివారం ముందుకొచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకు వచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం, శనివారంలోనే కాకుండా దాతల ఇష్టానుసారం రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాత రామ్మూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



సేంద్రియ ఎరువులు వేసిన పంటను పరిశీలిస్తున్న వాసు

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలకు రైతులు సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా పంటలు అధిక దిగుబడి వస్తాయని డీపీఎం వాసు తెలిపారు. శనివారం కృష్ణజమ్మపురంలో రైతులు ప్రకృతి వ్యవసాయంలో సేంద్రియ ఎరువులు వేసి సాగుచేసిన పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ వేరుశనగ పంట సాగుపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో వరిసాగు చేసి, తద్వారా వచ్చిన బియ్యాన్ని తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కిచెన్ గార్డెన్ మోడల్ విత్తనాల కిట్స్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పుష్ప, రైతులు షణ్ముగరెడ్డి, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

శ్రీరంగరాజపురం: ఉపాధిహామీ పనులను ఏపీఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేసి మస్టర్ రికార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వందరోజులు పని దినాలు కల్పించాలని, కూలీల సంఖ్యను పెంచి, వారి హాజరును ఆన్‌లైన్‌లో పొందుపరచాలని అన్నారు. ప్రతి కూలికి ఒక పనిదినానికి గరిష్ఠంగా రూ.300 కేటాయించడం జరిగిందన్నారు. కూలీల హాజరులో ఏవైనా అవకతవకలు చేసినట్లయితే సంబంధిత అధికారిని విధుల నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. అనంతరం మండలంలోని కటికపల్లి, 49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ ఫారం, కాలువ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

జగనన్న హయాంలోనే పేదలకు సంక్షేమం



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



పార్టీలో చేరిన వారితో విజయానందరెడ్డి

- టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: టీడీపీ ఐదేళ్ల పాలన పచ్చిమోసం ..పచ్చి అబద్ధాలతో గడిచిందని, జగనన్న హయాంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలో శనివారం 46, 31, 32, వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమాన్ని వివరించారు. ప్రచార కరపత్రాలను అందించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలకు అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారని గుర్తుచేశారు. అప్పట్లో పిల్లల నుంచి ముదుసలి వరకు బాబు మోసం చేసిన విషయం గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. ఇలా టీడీపీ ఐదేళ్ల పాలన మొత్తం పచ్చి అబద్ధాలతో గడిచిపోయిందన్నారు. డ్వాక్రా రుణమాఫీ అంటూ అక్కచెల్లెమ్మలను అప్పుల పాలు చేశారన్నారని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ అంటూ కొంప ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కారణంగా రైతులు, డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక అష్టకష్టాలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి నట్టేట ముంచేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మళ్లీ ఎన్నికలొచ్చాయని రాష్ట్రంలో టీడీపీ కొత్త నాటకాన్ని మొదలుపెట్టిందన్నారు. ఈ నాటకాన్ని రంజిపచేయడానికి జనసేన, బీజేపీలతో జతకట్టిందని చెప్పారు. మళ్లీ మోసం చేయడానికి చంద్రబాబు వేస్తున్న కుతంత్రమని ప్రజలకు అర్థమైపోయిందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మళ్లీ టీడీపీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ఇచ్చిన మాటకు కట్టుబడి జగనన్న ఇచ్చిన హామీలను పక్కాగా నెరవేర్చారన్నారు. పార్టీలు, మతాలు, కులాలు చూడకుండా అర్హులందరికీ పథకాలను వర్తింప జేశారన్నారు. మళ్లీ సంక్షేమ రాజ్యం చూడాలంటే అది జగనన్నతోనే సాధ్యమని, ప్రజలంతా ఏకమై వైఎస్సార్‌సీపీని ఈ సారి ఎన్నికల్లో గెలిపించుకోవాలని ఆయన కోరారు. తదనంతరం రాంనగర్‌కాలనీలో కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు జ్ఞాన జగదీష్, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు రెడ్డప్ప, సయ్యద్, అను, మనోజ్, జీకే, రాజేష్‌రెడ్డి,ముత్తు, ఆర్టీసీ చిన్న, ఇమ్రాన్, అప్సర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

చిత్తూరు నగరం రాంనగర్‌కాలనీలోని పలువురు ముస్లింలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఎస్‌కే రహ్మతుల్లా, రియాజ్, అబ్దుల్ రజాక్, జిలానీ, మజార్, చిన్న, నిజామ్, ఇమ్రాన్, నవాజ్, అఖిల్, సాధిక్, ఇర్ఫాన్, నూర్ అహ్మద్, సోహేల్‌ను ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం టీడీపీ, బీజేపీ కలిసి మైనారిటీల విషయంలో చేస్తున్న కుట్రలను పలువురు వెల్లడించారు.

నేడు బీసీ ఆత్మీయ సమావేశం

ఐరాల: పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ ఆత్మీయ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు తవణంపల్లె మండలం క్రాస్ రోడ్ సమీపంలోని నారాయణాద్రి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ హాజరువుతారన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ నేతలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఓటు నమోదుకు నేడే చివరి రోజు

నగరి: 18 ఏళ్లు దాటిన వారు ఓటు నమోదుకు ఆదివారం ఒక్కరోజు మాత్రమే అవకాశం ఉందని ఆపై కొత్త ఓటర్ల నమోదు చేయడం జరగదని ఎన్నికల అధికారి అయిన ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన అన్ని పార్టీల నేతలు, అధికారుల సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అన్ని పార్టీల వారు అనుమతులు లేకుండా ఏ కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. ప్రతి ఖర్చును లెక్కించడానికి అధికారులను నియమించడం జరిగిందన్నారు. నామినేషన్లు ప్రారంభించిన నాటి నుంచి ప్రక్రియ మరింత కట్టుదిట్టంగా ఉంటుందన్నారు. ఓటర్ల తొలగింపునకు, సవరణలకు గడువు ముగిసిందని ఇక అభ్యర్థనలు చేసుకున్నా స్వీకరించడం జరగదన్నారు. అలాగే కొత్త ఓటు నమోదుకు కూడా ఆదివారం చివరి తేదీ అని ఆపై తీసుకోవడం జరగదన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు.

చారాలలో ఫ్యామిలీ డాక్టర్





పల్లెచెరువులో సేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు, చారాలలో పరీక్షిస్తున్న వినయ్‌కుమార్

తవణంపల్లె: చారాలలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 43 మంది రోగులకు వైద్యపరీక్షలు చేయించి వైద్యం చేయించారు. సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

55 మందికి వైద్య సేవలు

పల్లెచెరువులో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు 55 మంది రోగులకు వైద్యపరీక్షలు చేయించి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



నాగలక్ష్మీని అభినందిస్తున్న కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి



లిఖిత్



గిరీష్

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పలు కళాశాలల్లో చదివిన విద్యార్థులు ఈ నెల 12 న విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ఆ విద్యార్థులను కళాశాలల యాజమాన్యం, ప్రిన్సిపల్స్, లెక్చరర్స్ అభినందించారు.

అరుణాచల కళాశాలలో: నగరంలోని మిట్టూరులో ఉన్న అరుణాచల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం సీఈసీలో నాగలక్ష్మీ 957 మార్కులు సాధించిందని కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సంజయ్ 928, జ్యోతి 926, మోనిష 918, బైపీసీలో భవ్య 909 మార్కులు సాధించారన్నారు.

విజ్ఞానసుధ కళాశాలలో: నగరంలోని కొంగారెడ్డిపల్లిలో ఉన్న విజ్ఞానసుధ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో లిఖిత్ 985, గిరీష్ 971, ప్రీతి 932 సాధించారని ఆ కళాశాల చైర్మన్ శ్రీధర్ వెల్లడించారు.

విద్య కళాశాలలో: నగరంలోని కొంగారెడ్డిపల్లిలో ఉన్న విద్య జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం వెటర్నరీ వొకేషనల్ గ్రూపులో చదువుతున్న శ్రావణి 930, ఎంపీసీ చదువుతున్న రెడ్డిప్రసాద్ 922 మార్కులు సాధించారని కరస్పాండెంట్ నవీన్‌కుమార్ వెల్లడించారు.

ధ్యానంతో వాస్తవ సాక్షాత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరాజు

పుత్తూరు: ధ్యాన క్రమంలో మన మనస్సును దేని మీదైతే కేంద్రీకృతం చేస్తామో అది మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుందని ధ్యాన జగత్ మాస పత్రిక పబ్లిషర్స్, ధ్యానరత్న డి.కేశవరాజు తెలిపారు. శనివారం స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమావేశం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేశవరాజు మాట్లాడుతూ పిరమిడ్ ధ్యాన విశిష్టతను వివరించారు. అనంతరం బ్రహ్మర్షి పితామహా పత్రీజీ చిత్ర మెమొంటోలను పంపిణీ చేశారు. సమావేశంలో స్కూల్ అసిస్టెంట్ పుష్పావతి భర్త జ్ఞాపకార్థం సంఘ భవన అభివృద్ధి పనులకు రూ.50 వేల విరాళాన్ని భాస్కర్‌రాజుకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు యుగంధర్‌రాజు, గుణశేఖర్ రెడ్డి, బాలసుబ్రమణ్యం, పురుషోత్తమశెట్టి, రవిశంకర్, సుబ్రమణ్యం, రామలింగం, రామ్మూర్తిరాజు, చంద్రశేఖర్‌వర్మ, అరుణాచలరెడ్డి పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడికి చెక్

- కలవకుంట జలాశయంలో పుష్కలంగా నీళ్లు
- మరో మూడు నెలలకు ఎలాంటి డోకా లేనట్టే
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన కార్పొరేషన్ యంత్రాంగం



ఇటీవల తన సిబ్బందితో కలిసి కలవకుంట జలాశయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు భూగర్భ జలాలు కూడా కాస్త అడుగంటుతున్నాయి. ఇలాంటి తరుణంలోనూ నగర వాసులకు ఎలాంటి నీటి ఇబ్బందులు కలగకుండా పెనుమూరు రోడ్డులో ఉన్న కలవకుంట జలాశయంలో ప్రస్తుతం నీటి మట్టం ఆశాజనకంగా ఉంది. దీంతో ఈ వేసవి నుంచి నీటి కష్టాలు లేకుండా బయటపడొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో కలవకుంట నీళ్లు అందని ప్రాంతాలకు మునిసిపల్ కార్పొరేషన్ యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కూడా సిద్ధం చేసింది. వేసవి వచ్చిందంటే చిత్తూరులో నీటి కష్టాలు వర్ణనాతీతంగా ఉంటాయి. చాలీచాలనీ అద్దెనీటి ట్యాంకర్ల వద్ద బిందెడు నీటికోసం ప్రజలు పెద్ద యుద్ధమే చేసేవాళ్లు. నాటి పాలకులైతే కాసులకు కక్కుర్తిపడి అద్దెనీటి ట్యాంకర్లకు దొంగబిల్లులు పెట్టి మరీ జేబులు నింపుకున్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితి అలాలేదు. ప్రతి నీటి ట్యాంకరుకు గ్లోబల్ పొజిషన్ సిస్టమ్ (జీపీఎస్)పరికరాలు, ట్యాంకరు ట్రిప్పు షీట్లలో స్థానికులు, అధికారుల సంతకాలు తప్పనిసరి చేశారు. రెండు లక్షలకు పైగా జనాభా ఉన్న చిత్తూరు నగరానికి రోజుకు 5.5 మిలియన్ లీటర్ల నీటిని కార్పొరేషన్ అధికారులు అందిస్తున్నారు. ఇందుకోసం జలాశయం నుంచి 5 మిలియన్ లీటర్ల నీటిని తీసుకుంటూ, నగరంలోని 457 బోర్ల నుంచి కూడా నీటిని తీసుకుంటున్నారు. కలవకుంట జలాశయం నీళ్లు నగరంలోని అన్ని ప్రాంతాలకు ఇవ్వడం సాధ్యంకాదు. ప్రధానంగా విలీన పంచాయతీలు, నగర శివారు ప్రాంతాలకు కలవకుంట నీళ్లు ఇచ్చే పరిస్థితిలేదు. కొన్ని చోట్ల నీటి పైపులైన్లు పాడైపోగా, మరికొన్ని ప్రాంతాల్లోలు ఎత్తులో ఉండడంతో జలాశకం నీళ్లు అందించలేని పరిస్థితి. ఇలాంటి ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు పది అద్దెనీటి ట్యాంకర్లతో రోజుకు 60 ట్రిప్పుల నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. నగర వాసుల నీటి కష్టాలకు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టడంతో వేసవికాలం వచ్చే నీటి కష్టాలను అధిగమిస్తూ వెళుతోంది.

ఫోన్‌చేస్తే చాలు

నగరంలో ప్రస్తుతం నీటి సమస్య ఎక్కడా లేదు. కలవకుంట జలాశయం నుంచి 80 శాతం ప్రాంతాలకు, బోర్ల నుంచి 15 శాతం, ట్యాంకర్ల ద్వారా 5 శాతం ప్రాంతాలకు పుష్కలంగా నీళ్లు ఇస్తున్నాం. కొన్నిబోర్లు రిపేర్లు చేయాల్సి ఉంది. వాటిని వెంటనే సరిచేయమని ఆదేశించాం. ప్రజలకు ఎక్కడైనా నీటి సమస్య ఉంటే ఫోన్-9849907885 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇస్తేచాలు. వెంటనే సమస్య పరిష్కరిస్తాం. ఆ మేరకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశాం

–డా.అరుణ, కమిషనర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

ఆర్టీసీ ఉద్యోగుల కోడ్ ఉల్లంఘన

- నాలుగు డిపోల ఉద్యోగులతో సమావేశం
- మహిళా అధికారులపై అనుచిత వ్యాఖ్యలు
- ఆర్‌ఎంకు రిపోర్ట్ చేసిన పుత్తూరు డిపో మేనేజర్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్టీసీ సీఐ





సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు, సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

పుత్తూరు: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవనే ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను ఆర్టీసీ ఉద్యోగులు బేఖాతరు చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్చి 16న ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన సంగతి విదితమే. అదే రోజు నుంచి జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉంటుందని అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయినా ఎన్నికల కోడ్‌ను యధేచ్ఛగా ఉల్లంఘిస్తూ ఈనెల 1న స్థానిక వాకర్స్ అసోసియేషన్ భవనంలో పుత్తూరు ఆర్టీసీ డిపోతో పాటు తిరుమల, మంగళం, సత్యవేడు డిపోలకు చెందిన ఒకే యూనియన్‌కు చెందిన సుమారు వందమంది ఉద్యోగులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ ప్రసంగాలు చేశారు. అంతే కాకుండా పుత్తూరు డిపోకు చెందిన మహిళా అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్థానిక ఆర్టీసీ సీఐ మంగమ్మ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ సమయంలో సమావేశం నిర్వహించి, ఇతర యూనియన్ల వారిని ఎలా దూషిస్తారంటూ సదరు యూనియన్ నాయకులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే కాకుండా, దూషణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి తిరుపతి ఆర్‌ఎంకు రిపోర్ట్ చేశారు. దీనిపై స్పందించిన ఆర్‌ఎం విచారణకు ఆదేశించినట్లు సమాచారం. నేటి ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసిన విషయాన్నే విస్మరించిన యూనియన్ నాయకులు ఇంకా తాము కార్పొరేషన్ ఉద్యోగులుగానే భావిస్తున్నారని, ఇతర యూనియన్ నాయకులు విమర్శించడం గమనార్హం.

బడుగుల కోసం జగనన్నను గెలిపించుకుందాం

- వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్
- తుంబపాళెం, ఈచనేరిపల్లె పంచాయతీల్లో ప్రచారం



బంగారుపాళెం: ఈచనేరిపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: బడుగు, బలహీన వర్గాల బాగు కోసం మళ్లీ సంక్షేమ ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని తుంబపాళెం పంచాయతీ పరిధిలో శనివారం ఉదయం ఆయన పర్యటించారు. ఉదయం తుంబపాళెం, దళితవాడ, ఎస్టీకాలనీ, బీసీ కాలనీ, కచటివారిపల్లె, సాయంత్రం ఈచనేరిపల్లె పంచాయతీ పరిధిలోని ఈచనేరిపల్లె, వంకరవారిపల్లె గ్రామాల్లో నాయకులతో కలసి జోరుగా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు పలకాలని ఇంటింటికీ వెళ్లి కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రెడ్డెప్పను అఖండ మెజారిటీ గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి పాటుపడిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని గుర్తుచేశారు. ఐదేళ్ల పాలనలో పేదల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. అలాంటి పాలన రావాలంటే వైఎస్సార్‌సీపీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. పేదలు, రైతులు, మహిళలు, వృద్ధులు సంతోషంగా ఉండాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని స్పష్టం చేశారు.

బురద రాజకీయాలే కూటమి ధ్యేయం

ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరిస్తూ ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతుంటే.. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మాత్రం బురద రాజకీయాలు చేస్తోందని సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. ఎన్నికల్లో లబ్ధి పొందాలని కూటమి నాయకులు కుటిల యత్నాలకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురద జల్లడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఓ వైపు వలంటీర్ల సేవలను కించపరుస్తూ, బెదిరింపులకు దిగుతున్న చంద్రబాబు అదే నోటితో రూ.10 వేలు ఇస్తానంటే నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. చంద్రబాబు పాలనంతా అవినీతి అక్రమాలేనని గుర్తుచేశారు. అధికారం కోసం మోసపూరిత హామీలు గుప్పించడం అధికారంలోకి రాగానే వాటిని విస్మరించి ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని చెప్పారు. బాబు మాయమాటలను, మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, జిల్లా రైతు సలహా సంఘం చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సర్పంచ్‌లు అనురాధ, ధనుంజయ, ఎంపీటీసీ సభ్యురాలు కవిత, మాజీ సర్పంచులు అరుణామల్‌రెడ్డి, థామస్, అశోక్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాలాక్షిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డి, మండల రైతు సంఘం నాయకులు రమేష్, సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, నాగేంద్ర, యువనాయకుడు హరి, జన్నేసుధాకర్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజ, మండల యూత్ అధ్యక్షుడు జగదీష్, మైనారిటీ నాయకుడు ముబారక్, సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ రెడ్డెప్ప, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

18 నుంచి మహాభారత యజ్ఞం



ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయం

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి మహా భారత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మోహన్‌రెడ్డి, తారక్ రెడ్డి శనివారం తెలిపారు. 15వ ఏటా జరిగే ఈ వార్షిక ఉత్సవాలను 10 రోజుల పాటు జరుపనున్నట్లు చెప్పారు. 18న గురువారం ధ్వజారోహణం, 19న శుక్రవారం యజ్ఞం పూజలు, 20న శనివారం యజ్ఞం ప్రత్యేక పూజలు, 21న ఆదివారం బండికుంభాలు, 22న సోమవారం ద్రౌపదీ దేవి కల్యాణం, 23న మంగళవారం ద్రౌపదీ మానసంరక్షణ, 24న బుధవారం అర్జున తపస్సు, 25 గురువారం యజ్ఞం పూజ, 26న శుక్రవారం ఉత్తరగోగ్రహణం, 27న శనివారం ఇలావంతుని వధ, 28న ఆదివారం దుర్యోధన వధ, ధర్మరాజుల పట్టాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.